వినియోగం లేదా?

- వైఎస్సార్‌సీపీ హయాంలో మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణం • నిర్మాణాలు పూర్తయినా నిరుపయోగంగా ఉంచిన కూటమి ప్రభుత్వం
- నెలలు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాని వైనం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి, ప్రారంభించిన బహుళ ప్రయోజన గోదాములను కూటమి ప్రభుత్వం వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రజలు, రైతుల ప్రయోజనార్థం నిర్మించిన భవనాలను నిరుపయోగంగా ఉంచారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలవుతున్నా మల్టీపర్పస్ గోడౌన్లను ఉపయోగించుకోకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటలను ఎక్కడ నిల్వ ఉంచుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తోంది..ఆరుతడి పంటలు కోతలు, నూర్పిడికి సిద్ధం చేశారు. దీనికితోడు భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, పంటల తడిసి నష్టపోతామేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. – ఉరవకొండ:


ఆమిద్యాల గ్రామంలో ప్రారంభానికి నోచుకోని మల్టీపర్పస్ గోడౌన్


రాకెట్లలో నిర్మాణం పూర్తయిన గోడౌన్

ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ పట్టణంతో పాటు ఆమిద్యాల, రాకెట్ల, నింబగల్లు, నెరిమెట్ల పంచాయతీల్లో మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణం జరిగింది. ఇందులో ఉరవకొండ పట్టణంతో పాటు ఆమిద్యాల, రాకెట్లలలో నిర్మాణాలు పూర్తయ్యాయి. విడపనకల్లు మండలంలోని వి.కొత్తకోటలో గోడౌన్ నిర్మాణం పూర్తయ్యింది. గడేకల్లులో ఇంకా నిర్మాణం జరుగుతుంది. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో ఆవులెన్న విరుపాపల్లి పంచాయతీల్లో గోడౌన్ల నిర్మాణం జరుగుతుంది. దుద్దేకుంటలో నిర్మాణం పూర్తయ్యింది. కంబదూరు, చాపరి, బండమీదపల్లి పంచాయతీల్లో పనులు 70 శాతం పూర్తయ్యాయి. రాయదుర్గం పరిధిలో కణేకల్లు, బ్రహ్మసముద్రంలో నిర్మాణాలు పూర్తి కాగా, ఉద్దేహాల్, శ్రీధరగట్టలో నిర్మాణాలు ప్రారంభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ.75 లక్షలు, 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి.

రూ.లక్షలు మంజూరయ్యాయి



గోడౌన్లు వినియోగంలోకి తీసుకోరావాలి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించిన మల్టీపర్పస్ గోడౌన్లను కూటమి ప్రభుత్వం ఉపయోగంలోకి తీసుకోరావాలి. గోడౌన్లు తెరిస్తే వాటిలో పప్పుశనగతో పాటు ఇతర పంటలు నిల్వ చేసుకుంటాం. వర్షం వచ్చిన సారి ధ్యానం ఎక్కడ భద్రపరుచుకోవాలో అర్థం కావడం లేదు.

– ఓబన్న, రైతు, ఉరవకొండ

ఇళ్లలో భద్రపరుచుకోవాల్సిందేనా?



మా గ్రామంలో రైతులందరం ఖరీఫ్ సీజన్‌కు వేరుశనగ, కంది, మొక్కజొన్న, మిర్చి పంటలు సాగు చేశాం. చేతికందిన పంటను తొలగించి, నూర్పిడి చేసేందుకు సిద్ధం చేశాం. పంటను ఇళ్లలోనే భద్రపరుచుకోవాల్సిందేనా?.. వర్షాలు వస్తే అవస్థలు తప్పవు. ప్రభుత్వం వెంటనే మల్టీపర్పస్ గోడౌన్లు ప్రారంభించి, పంటలు నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించాలి.

– శివలింగప్ప, రైతు, వజ్రకరూర్

అనుమతి రాగానే ప్రారంభిస్తాం



ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో పూర్తిన మల్టీపర్పస్ గోడౌన్లు పూర్తయిన వాటిని ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని ప్రారంభిస్తాం. రైతులు పండించిన పంటలను భద్రపరుచుకోవడానికి వినియోగించుకోవచ్చు. రైతులు మంచి ధర పలికేంతకు వరకు పంటను గోడౌన్లలో భద్రపరుచుకోవచ్చు.

– అరుణకుమారి, డీసీఓ, అనంతపురం

గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలి


బెణికల్లులో ప్రజల నుద్దేశించి మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

కణేకల్లు: గ్రామాల్లో గొడవలు లేకుండా ప్రశాంత జీవితాన్ని గడపాలని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ప్రజలకు సూచించారు. సోమవారం మండలంలోని బెణికల్లు గ్రామంలో ఎస్ఐ నాగమధుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్ణాటక మద్యం విక్రయించడం, నాటు సారా విక్రయం, మట్కా, పేకాట తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేసి చిన్నారుల జీవితాలను నాశనం చేయొద్దన్నారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే తక్షణమే విలేజ్ పోలీస్‌కు సమాచారం అందించాలన్నారు.

'పల్లె పండుగ'తో గ్రామాల అభివృద్ధి

కణేకల్లు: 'పల్లెపండుగ' కార్యక్రమంతో గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు కణేకల్లు ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కణేకల్లు, రచ్చుమర్రి, కళేకుర్తి తదితర గ్రామాల్లో 'పల్లెపండుగ' కార్యక్రమం కింద సిమెంటు రోడ్డు పనులకు ఎంపీపీ లీలావతి, సర్పంచు నిర్మలతో కలిసి ఎంపీడీఓ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, ఈఓఆర్‌డీ చంద్రామౌళి, కణేకల్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పల కుంట, పిల్లల పల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డ్వామా పీడీ సలీం బాషా, ఏపీడీ రమేష్ నాయక్, ఎండీఓ నందకిశోర్, పంచాయతీ సెక్రటరీ కవిత ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లల పల్లి, ముప్పల కుంట గ్రామాల్లో సీసీ రోడ్లు, మినీ గోశాలల నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

బొమ్మనహాళ్: మండలంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం ప్రత్యేక అధికారి తిప్పేస్వామి ప్రారంభించారు. సిద్ధరాంపురం, కురువల్లి, ఉంతకల్లు గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించి, అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దాస్, పీఆర్‌జేఈ జగదీష్, సర్పంచులు ఆంజనేయులు, ముక్కన్న తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: అంకంపల్లి, రామసాగరం గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ సూర్యప్రకాశ్ భూమిపూజ చేశారు.


కణేకల్లులో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ, అధికారులు

రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్లు

కూడేరు: ముద్దలాపురం, కూడేరు పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులు రూ.45 లక్షలతో 10 చోట్ల సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ రాజ్ (పీఆర్) డీఈ రసూల్, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. సోమవారం పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా కూడేరు, ముద్దలాపురంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు భూమి పూజ చేశారు. పీఆర్ డీఈ రసూల్ , ఎంపీడీఓ కుళ్లాయి స్వామి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధనుంజయ్య, లలితమ్మ, పీఆర్ ఏఈ రమణయ్య, ఏపీఓ తులసీ ప్రసాద్, ఈఓఆర్డీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

వజ్రకరూరు: పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ రమావత్‌దేవి పిలుపునిచ్చారు. సోమవారం వెంకటాంపల్లిపెద్దతండా, వెంకటాంపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ మణిభూషణ్, ఏపీఓ లక్ష్మీకాంత పాల్గొన్నారు.

రాయితీతో పప్పుశనగ పంపిణీ


కొకుంట్లలో రాయితీ పప్పుశనగ పంపిణీని ప్రారంభిస్తున్న ఏఓ శుభకర్


పప్పుశనగ అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ

డీ హీరేహాళ్ (రాయదుర్గం): ప్రభుత్వం 25 శాతం రాయితీతో అందించే పప్పుశనగ రైతులకు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం డి హీరేహాళ్ మండలంలోని నాగలాపురంలో ఏడీఏ లక్ష్మానాయక్‌తో కలసి రైతులకు పప్పుశనగ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 శాతం రాయితీతో క్వింటా రూ.7,050 చెల్లించాలన్నారు. రైతు అవసరాల మేరకు కణేకల్లు 4,500 క్వింటాళ్లు, బొమ్మనహాళ్ 500 క్వింటాళ్లు, డి హీరేహాళ్ 400 క్వింటాళ్లు అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ఏడీఏ మాట్లాడారు. ఈనెల 16 వరకు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాతే రైతులు పప్పుశనగ విత్తుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్, ఏఈఓ గోపాల్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల, పెద్ద కొకుంట్ల పంచాయతీల పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో సబ్సిడీ పప్పుశనగ పంపిణీ కార్యక్రమం ఏఓ శుభకర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ వాతావరణ శాఖ రాబోవు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వర్షాలు తగ్గిన తర్వాత శనగ సాగుచేసుకోవాలన్నారు. వేరుశనగ సాగుచేసిన రైతులు పంటను 3 రోజుల పాటు తొలగించొద్దు అని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామ రైతులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

నగరేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



వజ్రకరూరు: స్థానిక నగరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు, రుద్రాభిషేకం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. జరుట్ల రాంపురంలోని జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ అభిషేకాలు,విశేష పూజలు నిర్వహించారు.

రేషన్ పంపిణీ చేయలేదని వినతి

బెళుగుప్ప: అక్టోబర్ నెలకు సంబంధించి రేషన్ పంపిణీ చేయలేదని సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్డుదారులు సోమవారం విన్నవించారు. బెళుగుప్పలోని 1,2వ నంబర్ దుకాణాలు, గుండ్లపల్లి గ్రామంలో 12వ నంబర్ దుకాణం, కోనంపల్లి గ్రామంలోని 36వ చౌకధాన్యపు దుకాణాల్లో రేషన్ పంపిణీ చేయలేదని తెలిపారు. తహసీల్దార్ షర్మిళ మాట్లాడుతూ మండలంలోని నాలుగు చౌకధాన్యపు దుకాణాలపై విజిలెన్స్ కేసులు నమోదు కావడంతో రిపోర్టులను జిల్లా కలెక్టర్‌కు పంపామన్నారు. కలెక్టర్ నుంచి అనుమతి రాగానే గ్రామ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామన్నారు.

వేతనాల మంజూరు చేయండి


ఎంఈఓను సన్మానిస్తున్న యూటీఎఫ్ నేతలు

కూడేరు: స్థానిక ఎమ్మార్సీలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ మహమ్మద్ గౌస్‌ను యూటీఎఫ్ నాయకులు కలిసి సోమవారం శుభాకాంక్షలు తెలియజేశారు. గత నెల ఎంఈఓ లేకపోవడంతో మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయుల జీతాలు పెండింగ్ పడ్డాయి. సెప్టెంబర్ నెల జీతాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సాయికృష్ణ, యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు కె.సిద్దన్న, చంద్రమోహన్, వెంకటప్ప, సంపత్, చంద్రశేఖర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మత్తు అనర్థాలపై మేల్కోవాలి

అనంతపురం అర్బన్: చిలమత్తూరు మండలంలో అత్తాకోడలుపై జరిగిన అత్యాచార ఘటన తర్వాతైనా మత్తు అనర్థాలపై రాష్ట్ర ప్రభుత్వం మేల్కోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి సావిత్రి హితవు పలికారు. సోమవారం నగరంలోని ఐద్వా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అత్తాకోడలుపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంత్రి సవిత సొంత జిల్లా, ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో మహిళలకు రక్షణ లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మంచి వంగడాలతో అధిక దిగుబడులు

- రబీ శనగ పంట విత్తు సమయమిదే
- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఈ.చెండ్రాయుడు


బెళుగుప్ప మండలం గంగవరం వద్ద సాగు చేసిన శనగ పంట (ఫైల్)

కళ్యాణదుర్గం: రబీ శనగ పంట విత్తుకోవడానికి సమయమిదేనని కళ్యాణదుర్గం కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ.చెండ్రాయుడు, సస్యరక్షణ విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ ఈ.శిరీష తెలిపారు. రబీలో శనగ పంటను సాగు చేసే రైతులకు వారు యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలైన కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో ఏటా సుమారు 4 నుంచి 4.5 లక్షల హెక్టార్లలో శనగ పంట సాగు చేస్తారని ఆయన తెలిపారు. అయితే మన ప్రాంతానికి అనువైన అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలైన ఎన్‌బీఈజీ 452, జేజీ–11, ఎన్‌బీఈజీ 857 వంటి వంగడాలను అధికంగా రైతులు సాగు చేస్తారని తెలిపారు. ముఖ్యంగా శనగ పంట అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు విత్తుకోవచ్చని స్పష్టం చేశారు.

విత్తనశుద్ధి తప్పనిసరి..

శనగ పంట విత్తే ముందు రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ.చెండ్రాయుడు, సస్యరక్షణ విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ ఈ.శిరీష తెలియజేశారు. ముఖ్యంగా కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండజిమ్ లేదా 1.5 గ్రాముల టెబుకోనజోల్ తో పాటు 8–10 గ్రాముల ట్రై కోడెర్మాతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల ఎండు తెగులు తట్టుకుని నష్టం నివారించొచ్చని తెలిపారు.

కలుపు యాజమాన్య పద్ధతులు ఇలా..

కలుపు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా విత్తిన 24 గంటల్లోపు ఎకరానికి 1–1.2 మి.లీ ల పెండిలిథాలిన్ ముందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగు, తెగుళ్ల యాజమాన్యంలో భాగంగా 5 శాతం వేపగింజల కషాయం పంట తొలిదశలో బీటీ ఫార్ములేషన్ 400 గ్రాములు ఎకరాకు, అలాగే ఉధృతి అధికంగా ఉంటే థైనాక్సిఫైర్ 40 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లీ లు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. వీటి వల్ల తెగుళ్ల నివారణ సాధ్యమవుతుంది. ఎండుతెగులు, మొదల కుళ్ల తెగుళ్లు, వేరుకుళ్ల తెగుళ్ల యాజమాన్యంలో భాగంగా వీటి నివారణకు ఎకరాకు 200 గ్రాముల కార్బెండజిమ్, 600 గ్రాముల మాంకోజెబ్‌ను కలిపి మొక్కలు, వేర్లు తడిచేలా పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల తెగుళ్లను నివారించి అధిక దిగుబడులు సాధించొచ్చు.


కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ చెండ్రాయుడు

డిసెంబరులో మహాకవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్: డిసెంబరులో రాయలసీమ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమ ప్రముఖులపై కవితలను రాసి డిసెంబరు 8లోపు 99639 17187 వాట్సాప్ నంబరుకు పంపాలని సూచించారు.

ఇన్‌చార్జ్ సీఎస్‌డీటీగా బీఎం బాషా



బెళుగుప్ప: మండల ఇన్‌చార్జ్ సీఎస్‌డీటీగా బి.మహబూబ్ బాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. సీఎస్‌డీటీగా డిప్యూటీ తహసీల్దార్ పీర ఇదివరకు పనిచేశారు. కణేకల్లు రెగ్యులర్ సీఎస్‌డీటీగా విధులు నిర్వర్తించే బీఎం బాషాను మండల ఇన్‌చార్జ్ సీఎస్‌డీటీగా నియమించారు.

మట్కా బీటర్ అరెస్టు

బొమ్మనహాళ్: మండలంలోని గోనేహాళ్ గ్రామానికి చెందిన మట్కా బీటర్ సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.13,330 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. సత్యనారాయణ రెడ్డి,మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సాగు నీరందించడంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి

కూడేరు: పంటలకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు క్రిష్ణమూర్తి ధ్వజమెత్తారు. సోమవారం కూడేరులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగువన తుంగభద్ర డ్యాం , దిగువన శ్రీశైలం డ్యాంలు నీటితో పూర్తిగా నిండినా జిల్లాకు రావాల్సిన నీటిని తెచ్చుకోలేని దుస్థితి నెలకొందన్నారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన పంటలకు సాగు నీరందించాలన్న నినాదంతో ఈ నెల 15 నుంచి 21 వరకు సీపీఎం ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. 19న మండల పరిధిలోని కమ్మూరు, అరవకూరు, కూడేరులో బస్సు యాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వెంకటేశులు, నాయకులు మల్లికార్జున, ఈరప్ప, నారాయణ రెడ్డి, పెద్దన్న పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని బండూరు గ్రామంలో డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతమ్మ, ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు


మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున

రాయదుర్గంటౌన్: పారిశుధ్య కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగార్జున విమర్శించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రమాదకర పరిస్థితుల్లో పారిశుధ్య పనులు చేసే కార్మికుల జీవన ప్రమాణాలు మార్చాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందన్నారు. సీపీఐ నాయకులు కొట్రేష్, తిప్పేస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

జోడులింగాలకు విశేష పూజలు


కూడేరు: జోడులింగాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడులింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో సోమవారం శివపార్వతుల జోడులింగాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రం, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి, పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వాలీబాల్ పోటీల్లో ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాయదుర్గం: తిరుపతిలో ఈ నెల 6 నుంచి 13 వరకు నిర్వహించిన ట్రెక్కింగ్ క్యాంపు–1లో జరిగిన వాలీబాల్ పోటీలో రాయదుర్గం కేటీఎస్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పి.శివప్రసాద్, జి.గోపాల్ సత్తాచాటారు. ఈ క్యాంపులో ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఆరో ఆంధ్ర బెటాలియన్ కర్నూలు గ్రూపులో ప్రాతినిధ్యం వహించిన పి.శివప్రసాద్ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. సోమవారం తిరిగి కళాశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రఘురామమూర్తి ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, ఎన్‌సీసీ సీటీవో జక్కల కిరణ్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షాలు రానున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఏమైనా సమస్యలుంటే కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 9154566253కు ఫోన్ చేసి, సమాచారం అందజేస్తే సహాయ చర్యలు అందుతాయన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుమ్మఘట్ట: భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం తెలియజేశారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బొలెరో వాహనం బోల్తా

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామం వద్ద బొలెరో వాహనం బోల్తాపడింది. సోమవారం అనంతపురం నుంచి యాపిల్‌లోడ్ కళ్యాణదుర్గం వైపు వెళ్తుండగా వేగం నియంత్రించలేక బోల్తాపడి, రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. వాహన డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి తెలిపారు. సోమవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పట్టించుకోలేదన్నారు.విశ్రాంత ఉద్యోగులకు మౌలిక వసతుల కల్పనకు రిటైర్డ్ టీచర్ బసన్న రూ.16,116, సోమశేఖర్ రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గం అధ్యక్షులు శివప్రసాద్, చెన్నప్ప, మారెన్న, అంజనప్ప, భగవాన్‌దాస్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

కళింగర పంట ధ్వంసం


బెళుగుప్ప తండా సమీపంలో కళింగర పంటను నాశనం చేసిన ఎలుగుబంట్లు

బెళుగుప్ప: మండల పరిధిలోని బెళుగుప్ప తండా సమీపంలో రైతు సేవ్యానాయక్ సాగు చేసిన కళింగర పంటను ఎలుగుబంట్లు దాడి చేసి, నాశనం చేశాయి. బాధిత రైతు తెలిపిన మేరకు.. తనకున్న మూడు ఎకరాల్లో కళింగర పంట సాగు చేశానన్నాడు. సుమారు రూ.2.5 లక్ష పెట్టుబడి పెట్టానని, మరి కొన్ని రోజుల్లో కోతలు చేపట్టేందుకు పంట సిద్ధవుతుండగా తోట సమీపంలోని కొండ ప్రాంతం నుంచి రాత్రివేళల్లో ఎలుగుబంట్లు వచ్చి పంటపై దాడి చేసి తినివేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు.

ముగిసిన మద్యం టెండర్ల లాటరీ ప్రక్రియ

కంబదూరు: మద్యం టెండర్ల లాటరీ ప్రక్రియ ముగిసిందని కంబదూరు ఎక్సైజ్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కంబదూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలకు సంబంధించి నాలుగు మద్యం షాపులకు 50 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూఏలో కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో లాటరీ విధానం ద్వారా మద్యం షాపులను కేటాయించినట్లు తెలిపారు. కంబదూరు మద్యం షాపును లక్ష్మణమూర్తి, కుందుర్పి, ఎనుములదొడ్డి, శెట్టూరు మద్యం షాపులను నాగరాజు, ప్రతాప్, నగేష్ లాటరీ ద్వారా దక్కించుకున్నట్లు సీఐ తెలిపారు. ఈనెల 16 నుంచి కొత్త మద్యం షాపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మద్యం షాపులన్నీ అమిలినేని అనుచరులకే...

కళ్యాణదుర్గం రూరల్: అమిలినేని సురేంద్రబాబు ఎమ్మెల్యేగా ఉన్న కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మద్యం షాపులన్నీ దాదాపు టీడీపీ నాయకులకే దక్కాయి. నియోజకవర్గంలోకి 10 మద్యం దుకాణాలకు 154 మంది దరఖాస్తు చేసుకున్నారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన మూడు దుకాణాలకు 65 మంది, కళ్యాణదుర్గం రూరల్ పరిధిలో రెండు షాపులకు 21 మంది దరఖాస్తు చేశారు. 80 శాతంపైగా దరఖాస్తులు అమిలినేని అనుచరులే వేయడంతో 70 శాతం షాపులు వారికే దక్కాయి. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కుటుంబ సభ్యుడు దరఖాస్తుల విషయంలో కీలక పాత్ర పోషించడంతో ఎక్కువగా అందలేదు. కళ్యాణదుర్గంలోని మున్సిపాలిటీకి చెందిన ఒక మద్యం షాపు టెండర్ మండల పరిధిలోని ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తగలగా.. టీడీపీకి చెందిన కొంతమంది లీడర్లు తమకు వాటా కావాలంటూ తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.